

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

### మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన
## ఫుడ్ కమిషన్ చైర్మన్

ఆమనగల్లు, డిసెంబర్ 26: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఆర్థిక శాఖ మంత్రి వర్యులు తన్నీరు హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని మాజీ మంత్రికి వివరించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు సతీశ్, శివ ఉన్నారు.

## ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు అందించాలి

షాబాద్, డిసెంబర్ 26: అయోధ్య కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగం వృధాగా పోలేదని ప్రముఖ వక్త శ్రీ భాస్కరయోగి అన్నారు. మంగళవారం షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ఆవరణలో శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర మండల ఆధ్వర్యంలో అయోధ్య పూజిత అక్షింతల కలశ వితరణ మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వక్త భాస్కరయోగి మాట్లాడుతూ.. అయోధ్య కోసం ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారని, వారి త్యాగం వృధాగా పోలేదని చెప్పారు. అదే విధంగా ఎన్నో వందల సంవత్సరాల కల నెరవేరిందని అయోధ్య పురాణం గురించి ప్రజలకు వివరించారు. అయోధ్య రామమందిరం పూర్తయి, జనవరి 22వ తేదీ 2024 విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న విషయం అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. జనవరి 1వ తేది నుంచి 15వ తేదీ వరకు దేశమంతటా అయోధ్య రాముని పూజిత అక్షింతలు, గుడి చిత్రపటం, కరపత్రం ప్రతి ఇంటికీ అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర మండల సంయోజక్ గూడెం రమేశ్, గ్రామ సర్పంచ్ కొత్త పాండురంగారెడ్డి, విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు బోజిరెడ్డి, సభ్యులు మల్లేశ్, ప్రవీణ్, లిఖిత్, రాఘవేందర్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య వక్త భాస్కరయోగి

# సీసీ కెమెరాలతో నేరాల అదుపు

**రాచకొండ సీపీ సుధీర్‌బాబు**

**ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ**

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 26 : నేరాలను అదుపు చేయటంతో పాటు కీలక సాక్ష్యాలు అందించే నిఘానేత్రాలపై దృష్టి సారించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నిఘా నేత్రాలిచ్చిన సాక్ష్యాల వలన అనేక కేసుల్లో పురోగతి సాధిస్తున్నామని, సీసీకెమెరాల రికార్డుల ఆధారంగా నేరస్తులు కూడా వెంటనే దొరికిపోతున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా సీసీకెమెరాల ఏర్పాటుకు యువకులు, గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే రాచకొండ కమిషనరేట్ పరిధిలో పెద్ద ఎత్తున సీసీకెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిలో పలు కూడళ్లతో పాటు ఇంజినీరింగ్ కళాశాలల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

## రేషన్‌బియ్యాన్ని అమ్మినా, కొన్నా.. కఠిన చర్యలు

**ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్**

మహేశ్వరం, డిసెంబర్ 26 : రేషన్ బియ్యాన్ని అమ్మినా కొన్నా వారిపై చట్ట పరంగా తగు చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం మహేశ్వరంలోని రైస్ మిల్లులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని కొనడాన్ని ఆయన తప్పుపట్టారు. రేషన్ బియ్యాన్ని అక్రమార్గంలో అమ్మినా కొనుగోలు చేసినా సదరు వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లులకు విక్రయించే వారిపై పటిష్టమైన నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. మిల్లర్లు కొంటున్న వద్ద వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆయన సూచించారు.



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్

### మత్తు పదార్థం విక్రయిస్తున్న
## ముఠా అరెస్ట్

**నిందితుడు ఎక్సైజ్ కానిస్టేబుల్ గొల్ల రమేశ్**

**కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు**

షాద్‌నగర్, డిసెంబర్ 26 : చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ ఉద్యోగే మత్తు పదార్థాలను విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటన షాద్‌నగర్ పట్టణ శివారులో మంగళవారం వెలుగుచూసింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన విఠల్‌గౌడ్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా ఓ ముఠాగా ఏర్పడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అల్ప్రాజోలం అనే మత్తు పదార్థాన్ని విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నాడు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ప్రత్యేక పోలీసు బలగాల తనిఖీల్లో విఠల్ గౌడ్ ముఠా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించి విచారణ చేపట్టారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని పరిగి రోడ్డులో కామారెడ్డికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గొల్ల రమేష్ అలియాస్ రాము సుమారు రూ. 20 లక్షల విలువ చేసే రెండు కిలోల అల్ప్రాజోలం విక్రయిస్తుండగా తెలంగాణ రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు పట్టుకొని షాద్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ఘటనపై షాద్‌నగర్ పోలీసులు పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి రమేష్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కారును సీజ్ చేశారు. పోలీసులు పెద్దమొత్తంలో మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్న వార్త స్థానికంగా సంచలనంగా మారింది.

## ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 26 : ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌పై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రోద్బలంతో అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్, కమిషనర్ యూసుఫ్‌లు తనను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టారని, అలాగే మాజీ ఎమ్మెల్యే ఆయన తనయుడు 14మంది కౌన్సిలర్ల చేత తనపై తప్పుడు ఫిర్యాదు చేయించి అకారణంగా సస్పెండ్ చేయించారని ఆమె ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

### రేపు కొంగరకలాన్‌కు
## అమిత్‌షా రాక

ఆదిబట్ల, డిసెంబర్ 26: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ కు ఈనెల 28న వస్తున్న అమిత్‌షా సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్‌హాల్‌లో జిల్లా ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి అమిత్‌షాతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై ఏవిధంగా పనిచేయాల్లో ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

**భారీ బందోబస్తు..**

కొంగరకలాన్‌లో అమిత్‌షా పర్యటనను దృష్టిలో పెట్టుకొని పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం రాత్రి మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావుతో కలిసి బందోబస్తును పరిశీలించారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పెద్ద ఎత్తున పోలీసులను బందోబస్తులో ఉండేలా చూడాలని ఏసీపీకి సూచించారు. వారి వెంట ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డితోపాటు ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఏఎస్‌రావు సేవలు చిరస్మరణీయం

చర్లపల్లి, డిసెంబర్ 26 : పద్మభూషణ్ డాక్టర్ ఏఎస్ రావు దేశానికి చేసిన సేవలు మరిచిపోలేనివని ఏఎస్‌రావునగర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్‌రావు, రామ్మూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఏఎస్‌రావునగర్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హోమిజేబాబా కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎస్‌రావు కుటుంబ సభ్యులు సుగుణ, శర్మ, చారుణి, మార్కోస్, యశోబార్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు ఈసీఐఎల్ పరిశ్రమను స్థాపించడంతో వేలాది కుటుంబాలు ఉపాధి పొందాయని, లక్షలాది మందికి ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక అధ్యక్షుడు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞానాన్ని నమ్మి దేశ పురోగతికి కృషి చేశారని, ఏఎస్‌రావుపై డాక్యుమెంటరీ ఫిలీం నిర్మాణం చేపట్టామని, ఆయన ఆశయ సాధన కోసం అన్ని వర్గాల వారు కృషి చేయాలని కోరారు. అంతకుముందు ఈసీఐఎల్ పరిశ్రమ, ఏఎస్‌రావునగర్‌లోని ఏఎస్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ కోశాధికారి కృష్ణమూర్తి, డైరెక్టర్లు సంగయ్య, సోమయ్యాచారి, చంద్రకుమార్, రామచందర్, విజయ్‌కుమార్, రాధ, సీపీఎం రాష్ట్ర నాయకులు డీజీ.నర్సింహా రావు, లక్ష్మణ్‌రావు, ఈసీనగర్ కార్యదర్శి లక్ష్మణ్‌రావు, శ్రీమన్నారాయణమూర్తి, చల్లా లీలావతి, శివరామకృష్ణ, శారద, భార్గవ్, రామారావు, అశోక్, వీఎస్.మూర్తి, శ్రీనివాస్, సొసైటీ మహిళా కార్యవర్గ సభ్యులు, ఏఎస్ రావు నగర్ డివిజన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఎస్‌రావు కుటుంబ సభ్యులు, హౌసింగ్ సొసైటీ సభ్యులు

# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ఆటో యూనియన్ అధ్యక్షుడు చింతల నందకిశోర్**
- **శంషాబాద్‌లో ర్యాలీ తీసిన ఆటో కార్మికులు**

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 26:ఆటో కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బీఎంఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ హెచ్చరించారు. మంగళవారం ఆటో యూనియన్, బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు శంషాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడంతో ఆటో కార్మికులకు జీవనోపాధి పూర్తిగా దెబ్బతిని అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆటో కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా వారి నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని ఆరోపించారు. ఆటో కార్మికులకు న్యాయం చేయనిచో మరింత ఆందోళనను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎండీ సయ్యద్, రవి, శ్రీను, జగదీశ్, శివ, దర్శన్, శ్రీశైలం, నర్సింహాగౌడ్, సురేశ్, శేఖర్, సలీం, ఫిరోజ్, ఫయాజ్, కృష్ణ, శ్రీను, రంజిత్, లడ్డూ, మాణిక్, రమేశ్, ప్రవీణ్, నాగప్పచారి, మల్లేశ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.




శంషాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్, తదితరులు